క్లుప్తంగా

నేడు తిరుప్పావడ సేవ

సింగరాయకొండ: జిల్లాలో ప్రసిద్ధి చెందిన పాత సింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో బుధవారం ఉదయం 7 గంటలకు స్వాతి నక్షత్రం సందర్భంగా యోగానంద లక్ష్మీ నరసింహస్వామికి పంచామృతాభిషేకం, తిరుప్పావడ సేవ నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు ఉదయగిరి లక్ష్మీ నరసింహాచార్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేసి తీర్థప్రసాదాలు స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు.

నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు దూరం


డ్రైవర్లు, కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై

టంగుటూరు: రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు దూరం చేయవచ్చని ఎస్సై వీ నాగమల్లేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం రోడ్డు భద్రతా నిబంధనలపై ఎస్సై కొండపి రోడ్డులో ట్రాక్టర్, ఆటో డ్రైవర్లు, పచ్చాకు కూలీలకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం పొగాకు సీజన్ నడుస్తున్నందున కూలీలు భద్రతకు రైతులు పూర్తి సహకారం అందించాలన్నారు. ట్రాక్టర్ డ్రైవర్లు ఎత్తు తగ్గించి పొగాకు వేయాలని, రెండు వైపులా డోర్లు తీయకూడదని వారికి సూచించారు. కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దేవాలయ షాపులకు వేలం

పొన్నలూరు: మండలంలోని చెన్నిపాడు సంగమేశ్వరం దేవాలయంలో టెంకాయలు, ఆట వస్తువులు, తినుబండారాలు, ఫలహారశాల, పలు వస్తువులు అమ్ముకోవడానికి ఈ నెల 27న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో చౌదరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ముందుగా రూ. 5 వేలు ధరావత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని ప్రకటనలో తెలిపారు.

ఇంటి పన్నులు వేగవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ హనుమంతరావు

పామూరు: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఇంటి వసూళ్లను వేగవంతం చేయాలని డీఎల్‌పీఓ ఎంవీఎల్.హనుమంతరావు, ఎంపీడీఓ బొలినేని సురేష్‌లు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ హాలులో మంగళవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు పంచాయతీల పరిధిలో నిర్వహిస్తున్న పలు సర్వేలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డీఎల్‌పీఓ మాట్లాడుతూ ముఖ్యంగా పంచాయతీలో చెత్త తొలగింపు, స్వచ్ఛత మొదలైన వాటిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కేఎల్.శ్రీనివాసరావు, పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

నియోజకవర్గ పోటీల పరిశీలన


పోటీలను పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి కుమార్

కొండపి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న పోటీలను కొండపి అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి ఏ.కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 25 తేదీన జరిగే జాతీయ ఓటర్ దినోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా మంగళవారం విద్యార్థులకు జూనియర్ సీనియర్ స్థాయిలో క్విజ్, వ్యాసరచన, డిబేట్ పోటీలు నిర్వహించామన్నారు. గెలుపొందిన విద్యార్థులు 23వ తేదీ జరిగే జిల్లా స్థాయి పోటీలలో పాల్గొంటారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి మురళి, ఎంపీడీవో రామాంజనేయులు, విద్యాశాఖాధికారులు కే. సురేఖ, రామారావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్.ఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నీరున్నా తీరని దాహం..!


హాజీపురం అడ్డరోడ్డులో ఏర్పాటు చేసిన సంప్


హాజీపురం అడ్డరోడ్డు వద్ద నీరు లేక నిరుపయోగంగా ఉన్న ట్యాంక్

అసలే కరవుతో అల్లాడుతున్న ప్రాంతం. దానికి తోడు అధికారుల నిర్లక్ష్యం. కూటమి పాలకులు పట్టించుకోకపోవడంతో ఆ గ్రామాలు తాగునీటి కోసం అల్లాడిపోతున్నాయి. నీరున్నా కూడా తాగడానికి చాలా ఇబ్బందులు పడుతున్న పరిస్థితి. పైప్‌లైన్ల లీకులు, మోటార్ల మరమ్మతులకు గురైనా ఇరిగేషన్ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. ఫలితంగా చందవరం ప్రాజెక్టు పరిధిలోని గ్రామాలు నీరందక అష్టకష్టాలు పడుతున్నాయి.

- చందవరం ప్రాజెక్టు నుంచి గ్రామాలకు అందని సాగర్ జాలాలు
- హాజీపురం దాటి పైగ్రామాలకు సరఫరా కాని నీరు
- పైపులైన్లు పగిలి వృథాగా పోతున్న వైనం
- పట్టించుకోని కాంట్రాక్టర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు

హనుమంతునిపాడు: ఏడు నెలల నుంచి చందవరం ప్రాజెక్టు నుంచి అందించే సాగర్ తాగు నీరు సక్రమంగా సరఫరా కాకపోవడంతో గ్రామాల్లోని ప్రజలు తాగు నీటికి తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రాజెక్టు నుంచి మండలంలోని అన్ని గ్రామాలకు సాగర్ జలాలు సరఫరా చేసేందుకు పైపు లైన్లు, వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేశారు. దాసరిపల్లి, గొట్లగట్టు నుంచి దాసరిపల్లి, కొండారెడ్డిపల్లి హనుమంతునిపాడు మీదుగా హాజీపురం అడ్డ రోడ్డు వరకు పైపులైన్లు ఏర్పాటు చేశారు. అడ్డరోడ్డులో ఓవర్ హెడ్ పెద్ద ట్యాంకు, సంప్ ఏర్పాటు చేశారు. సంపునకు, ట్యాంకు నీటిని పంపింగ్ చేసి ఇక్కడ నుంచి హాజీపురం, దొడ్డిచింతల, సీతారాపురం, కూటాగుండ్ల, దాసళ్లపల్లి, ముప్పాళ్లపాడు వరకు నీటిని సరఫరా చేయాలి. కూటాగుండ్ల వద్ద సంప్ ఏర్పాటు చేశారు. మోటార్ల ద్వారా దాసళ్ల పల్లి, ముప్పాళ్లపాడు వరకు సరఫరా చేయాలి. హాజీపురం అడ్డ రోడ్డు సంప్ నుంచి చుక్క నీరు సరఫరా చేయడం లేదు. ప్రాజెక్టులో నీరున్నా ప్రజలకు సరిపడా నీటిని సరఫరా చేయడం లేదని గ్రామాల్లో ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఎక్కడ చూసినా పైప్‌లైన్ల లీకులు..

వేములపాడు నుంచి నందనవనం, పాపిరెడ్డిపల్లి, వాలిచర్ల, పెద్దగొల్లపల్లి, తిమ్మారెడ్డిపల్లి, నల్లగండ్ల, ఉమ్మనపల్లి, చిన్నుమ్మనపల్లి, హనుమంతాపురం, కుడుమల కుంట, రంగంపేట, రక్షణాపురం వరకున్న గ్రామాలకు కూడా సాగర్ జలాలు సరఫరా అవ్వడం లేదు. తిమ్మరెడ్డిపల్లి, నుంచి వాలిచర్ల, నల్లగండ్ల, కుడుమలకుంట వరకు సాగర్ చుక్క అందించడం లేదని గ్రామాల్లో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బబుల్ నీటిని రూ.20 క్యాన్‌కు పెట్టి కొనుగోలు చేస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. 70 గ్రామాల్లో ప్రతి పంచాయతీలో 40 వేల లీటర్లు, 20 వేల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకులు ఉన్నాయి. ఏ ఒక్క గ్రామంలో నీటిని ట్యాంకులకు ఎక్కించిన దాఖలాలు లేవు. పైపులైన్లు లీకులు మరమ్మతులు చేయక వచ్చిన నీరు వచ్చినట్లు వృథాగా పోతుంది. ప్రజలకు మాత్రం తాగు నీరు అందించడం లేదు.


నర్సరీ మధ్యలో పైపు లైన్లు పగిలి వృథాగా పోతున్న సాగర్ జలాలు

సిబ్బందికి జీతాల్లేక జీవితం సాగక..

23 పంచాతీయల్లో సాగర్ జలాల పైప్‌లైన్ల లైన్‌మెన్లు 42 మంది ఉన్నారు. వారికి కూటమి ప్రభుత్వం 7 నెలల నుంచి జీతభత్యాలు ఇవ్వకపోవడంతో అవస్థలు పడుతున్నారు. పైప్‌లైన్ల మరమ్మతులు గురించి పట్టించుకోవడం లేదు. కూటాగుండ్ల వద్ద సంప్‌కు పంపింగ్ చేసేందుకు ఏర్పాటు చేసి మోటార్లు మరమ్మతులకు గురై మోటార్లు కాలి పోయాయి. కాంట్రాక్టరు మోటార్లను మరమ్మతుల కోసం తీసుకెళ్లి నెలలు గడుస్తున్నా ఇంతవరకు బిగించలేదు. నెలలో ఒకటి రెండు సార్లు కూడా రావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఒక వేళ అవి వచ్చినా రంగుమారి వస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగు నీటికి తీవ్ర అవస్థలు తప్పడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపులైన్లకు మరమ్మతులు, మోటార్లు బిగించి నీరు సరఫరా చేయాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


నెలకు ఒక్కసారి కూడా నీరు రాలేదు..

మాగ్రామానికి నెలకు ఒక్క సారికూడా సాగర్ జలాలు సరఫరా అవ్వడం లేదు. గ్రామంలో తాగునీటికి అవస్థలు పడుతున్నాం. గ్రామంలో ఉన్న డీప్ బోర్ కూడా చెడిపోయింది. రిపేరు చేయడం లేదు, అధికారులు పట్టించుకోవడం లేదు. చివరికి మూగ జీవాలు సైతం నీరులేక అల్లాడుతున్నాయి.

– పీ.రామక్రిష్ణారెడ్డి, అప్పలరెడ్డిపల్లి


మోటార్లు రిపేరుకు వచ్చాయి..

కూటాగుండ్ల వద్ద సంప్‌కు ఉన్న మోటార్లు రిపేరుకు వచ్చాయి. రిపేరుకు పంపించాం. అందువలన దాసళ్లపల్లి, ముప్పాళ్లపాడు, రామాయిపల్లి గ్రామాలకు సాగర్‌జలాలు వెళ్లడం లేదు. సంప్‌లకు ఎక్కించి వారంలో రెండు రోజులపాటు సాగర్ జలాలు సరఫరా చేస్తున్నాం. పైపులైన్ల లీకులకు మరమ్మతులు చేస్తున్నాం.

శ్రీకాంత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, హెచ్‌ఎంపాడు

నేడు కనిగిరిలో జాబ్ మేళా

కనిగిరి రూరల్: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జీసీ అండ్ వైపీఎస్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో స్థానిక జీసీ అండ్ వైపీఎస్ డిగ్రీ కాలేజీలో బుధవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు స్కిల్ హబ్ కోఆర్డినేటర్ ఆర్ బెనర్జీబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేళాకు ఆరు ప్రముఖ కంపెనీలు వస్తాయన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో విద్యార్హతలు కలిగి, 18 నుంచి 28 ఏళ్ల వయస్సు కల్గిన నిరుద్యోగ, యువతి యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కళాశాల డైరక్టర్ ఏలూరి సుబ్బారావు ప్రకటనలో తెలిపారు.

పొగాకు బ్యారన్ దగ్ధం

కొండపి: ప్రమాదవశాత్తు పొగాకు బ్యారన్ దగ్ధమైన ఘటన మండలంలోని కట్టవారిపాలెం గ్రామంలో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. రావెళ్ల చెంచురామయ్యకు సంబంధించిన బ్యారన్‌లో క్యూరింగ్ చేస్తున్న సమయంలో పొగాకు ఆకు కర్ర జారి పడడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. బ్యారన్‌లోని ఆకు,టైర్లు పూర్తిగా కాలిపోయాయి. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందజేయడంతో కొండపి అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి వచ్చి మంటలను అదుపు చేశారు. సుమారు రూ.2.50 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని అంచనా వేశారు.

దుకాణాల వేలం ఆదాయం రూ.41.09 లక్షలు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో వివిధ దుకాణాల ఏర్పాటుకు నిర్వహించిన వేలంలో రూ..41.09 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు తెలిపారు. ఆలయ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం దేవదాయ శాఖ కందుకూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ జి.ఏ.సత్యనారాయణ పర్యవేక్షణలో ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఈఓ ఆధ్వర్యంలో మొత్తం 12 రకాల దుకాణాల నిర్వహణకు బహిరంగ వేలం నిర్వహించారు. వేలం నిలిచిన మరో 4 దుకాణాలకు 27వ తేదీన తిరిగి వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలం హక్కుదారులు ఈ ఏడాది ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 2026 జనవరి 31 వరకు దుకాణాలు నిర్వహించుకుంటారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ షేక్.ఖాదర్‌బీబుజ్జి, కొమ్మినేని వెంకట్రావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

చెరువు కట్టకు దారేది.. !


చెరువుకట్టకు వెళ్లే దారిలో చెత్తా, చెదారంలో తిరుగుతున్న పందులు

కొండపి: ప్రతి శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ అనే కార్యక్రమంతో పరిసరాలు పరిశుభ్రం చేస్తున్నారు. అధికారులు ప్రధాన సెంటర్లలో కాకుండా తూతూ మంత్రంగా కార్యక్రమాలు చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రమైన కొండపి చెరువు కట్ట మీద వెళ్లడానికి వాకర్లు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వైఎస్సార్ సీపీ హయాంలో చెరువుగట్టును వెడల్పు చేసి వాకర్లు వాకింగ్ చేసుకోవడానికి, వాహనాలు కొండపి నుంచి కట్టవారిపాలెం వెళ్లడానికి అనువుగా ఉండేది. అయితే గత కొంత కాలంగా ముళ్లచెట్లు ఏపుగా పెరిగి దారి కనిపించకుండా ఆక్రమించేశాయి. ముళ్లచెట్లు పెరగడంతో ఆ ప్రాంతంలో పాములు తిరుగుతుండటంతో వాకింగ్‌కు వెళ్లడానికి ప్రజలు భయపడుతున్నారు. గతంలో చెరువుగట్టు మీద ట్రాక్టర్లు ప్రయాణించేవి. ఇప్పుడు చెరువుగట్టు ఎక్కడానికి ముళ్లపొదలు ఆక్రమించడంతో ద్విచక్ర వాహనదారులు కూడా ప్రయాణించడానికి బెంబేలేత్తుతున్నారు.


చెరువుకు వెళ్లే దారిలో ఉన్న ముళ్లపొదలు

చెత్త చెదారం ఆ దారిలోనే..

చెరువుగట్టుకు వెళ్లే దారిలోనే చెత్తా చెదారాన్ని ప్రజలు వేస్తున్నారు. చికిన్ షాపుల వ్యర్థాలు, చనిపోయిన కోళ్లను కూడా చెరువుకు వెళ్లే దారిలోనే పడేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా ముక్కుపుటాలు అదిరే దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. ఆరోగ్యం కోసం చెరువు గట్టు మీదకు వెళ్లి వాకింగ్ చేద్దామనుకుంటే ఈదుర్వాసనతో అనారోగ్యం పాలవుతున్నామని పలువురు వాకర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆ ప్రాంతంలో ఉన్న చిల్లచెట్లను తొలగించి, కోళ్ల వ్యర్థాలను అక్కడ వేయించకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రక్తదాన దాతకు సత్కారం


గయాజ్‌కు సన్మానం చేస్తున్న పలు సంఘాల నాయకులు

కనిగిరి రూరల్: 50 సార్లు రక్తదానం చేసిన జనవిజ్ఞాన వేదిక జాతీయ ఉపాధ్యక్షుడు ఎస్‌కే గయాజ్ బాషాను మంగళవారం పలు ప్రజా సంఘాలు, విద్యా సంస్థలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కేటీసీ స్టడీ సర్కిల్ సెంటర్‌లో శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ 63 ఏళ్ల వయస్సులో కూడా 50 సార్లు బీ పాజిటివ్ రక్తాన్ని ఇచ్చి రక్తదాతగా పేరొందారని కొనియడారు. గయాజ్ బాషా జేవీవీ నాయకుడిగా, కళా కారునిగా సమాజ చైతన్య, సేవాహిత, విద్యా ప్రచార కార్యక్రమాల్లో నిరంతరం ఎంతో శ్రమించి పనిచేస్తూ అందరి మన్నలను పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు మీగడ వెంకటేశ్వరరెడ్డి, వీ మాలకొండారెడ్డి, విజేత విద్యా సంస్థల అధినేత పసుపులేటి అరుణోదర్, మదర్ థెరిస్సా సేవా సంస్థ అధ్యక్షుడు సయ్యద్ నాయబ్ రసూల్, వివిధ సంస్థల నాయకులు పాల్గొన్నారు.

ఆటోల్లో పరిమితికి మించి ఎక్కిస్తే చర్యలు


ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

సింగరాయకొండ: ఆటోల్లో ప్రభుత్వ నిబంధనలకు మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ సీహెచ్ హజరత్తయ్య హెచ్చరించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ఆటో నడిపే ప్రతి డ్రైవరు ముందస్తుగా డ్రైవింగ్ లైసెన్స్, సీబుక్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికేట్ కలిగి ఉండాలన్నారు. ఇందులో ఏ ఒక్కటి లేకపోయినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎస్సై మహేంద్ర, ఏఎస్సై షేక్ మహబూబ్ బాషా, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

దళితుల భూములు కాపాడాలని వినతి


తహసీల్దార్ ఉషాకు అర్జీ అందజేస్తున్న దళిత నాయకులు

పీసీపల్లి: వెలిగొండ ప్రాజెక్టు పరిధిలోకి పీసీపల్లి మండలాన్ని చేర్చాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద దళితులు ధర్నా చేపట్టారు. ధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ మండలంలోని కోదండ రామాపురం, మెట్టవారిపాలెంలోని 22 మంది దళితులకు 1994లో ఎస్సీ కార్పొరేషన్ భూమి కొనుగోలు పథకం ద్వారా 24 ఎకరాలు కొనుగోలు చేసి దళితులకు ఇచ్చారన్నారు. అప్పటి నుంచి ఆ భూములను దళితులు సాగు చేసుకుంటున్నారని తెలిపారు. ఈ భూములును పొరుగు మండలాల వారిపేరి మీద ఆన్‌లైన్‌లో నమోదు చేసి పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చినట్లు రికార్డుల్లో ఉన్నట్లు వెంకటేశ్వర్లు తెలిపారు. అంతేకాకుండా వారికి పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వం దళితులకు ఇచ్చిన భూములను ఎవరు కొనకూడదు, అమ్మకూడదు అనే చట్టాన్ని అమలు చేసి పాస్ పుస్తకాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆర్డీవో విచారణ చేస్తారు..

భూ సమస్య గురించి కలెక్టర్, కనిగిరి ఆర్డీఓని విచారణ అధికారిగా నియమించారని, త్వరలో గ్రామాల్లోనికి వచ్చి భూములు పరిశీలించి దళితులను విచారించి నివేదిక కలెక్టర్ కు సమర్పిస్తారని స్థానిక తహసీల్దార్ సీహెచ్ ఉష దళితులకు తెలిపారు. అదేవిధంగా ఫోర్జరీ చేసిన వారిపై కూడా చర్యలు తీసుకుంటామని ఆమె చెప్పారు.

తూతూ మాత్రంగా మండల సమావేశం


అధికారులతో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ ప్రదీప్

టంగుటూరు: తూతూ మాత్రంగా మండల సమావేశం నిర్వహించారు. ఉదయం 11 గంటలకు ప్రారంభించాల్సిన సమావేశం అటు అధికారులు, ఇటు ప్రజా ప్రతినిధులు రాక ఉన్న కాస్త మందితో 12. 45 గంటలకు ప్రారంభమైంది. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పటాపంజుల కోటేశ్వరమ్మ అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు పనితీరు వివరించారు. వైస్ ఎంపీపీ రావెళ్ల ప్రదీప్ మాట్లాడూతూ కారుమంచి గ్రామంలో ప్రజల సౌకర్యార్థం గ్రామ సచివాలయం నిర్మిస్తుంటే అభివృద్ధిని అడ్డుకోవడానికి సర్పంచ్, వల్లంరెడ్డి లక్ష్మారెడ్డి కోర్టును ఆశ్రయించి నిర్మాణం నిలుపుదల చేశారని, దీనికి మీరు ఏం చర్యలు తీసుకున్నారని అధికారులను నిలదీశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమావేశాలకే రాలేదంటే ఇక ప్రజల సమస్యలు ఎలా పరిష్కరిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. సిబ్బంది సమస్యలు పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా ఉంటున్నారని అనంతవరం సర్పంచ్ ఉప్పలపాటి శివరామరాజు సమావేశంలో కోరారు. కార్యక్రమంలో ఇంచార్జి ఎంపీడీవో రామసుబ్బారావు, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

ఉల్లాస్‌తో అక్షరాస్యత పెంపు

సీఎస్‌పురం (పామూరు): పొదుపు మహిళలను నూరుశాతం అక్షరాస్యులుగా చేయడమే ఉల్లాస్ కార్యక్రమ లక్ష్యమని ఎంపీడీఓ మంచికంటి రంగసుబ్బరాయుడు అన్నారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో మంగళవారం వయోజన విద్య సూపర్‌వైజర్ రామన వెంకటేశ్వరరెడ్డి, ఏపీఎం యం.లక్ష్మీనారాయణ, అధ్యక్షతన ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా వలంటరీ టీచర్స్‌కు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పొదుపుగ్రూపుల్లోని వయోజనులకు సంపూర్ణ అక్షరాస్యులను చేయడమే లక్ష్యంగా వలంటరీ టీచర్లు పనిచేయడాలన్నారు. అనంతరం వలంటీర్లకు అక్షరవెలుగు మార్గదర్శిని పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీసీలు కాశయ్య, సుబ్రమణ్యం, నారాయణమ్మ, వీఓఏలు పాల్గొన్నారు.

రైతు సమక్షంలోనే రీ సర్వే చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో లక్ష్మీప్రసన్న

జరుగుమల్లి (సింగరాయకొండ): రైతులకు ఇబ్బంది కలగకుండా రైతు సమక్షంలోనే భూముల రీ సర్వే చేయాలని ఒంగోలు ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న సర్వేయర్లు, వీఆర్‌ఓలకు సూచించారు. జరుగుమల్లి మండలం నందనవనం పంచాయతీ వావిలాలవారి కండ్రికలో మంగళవారం భూముల రీ సర్వేపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ రీ సర్వే జరిపే రోజు రైతులకు నోటీసు ద్వారా తెలపాలని, ఒకవేళ ఆ రోజు రైతు రాకపోతే మరుసటి రోజు రీ సర్వే చేయాలే తప్ప రైతులను ఇబ్బంది పెట్టకూడదన్నారు. ఒక రైతుకు ఒక ఎల్పీఎం నంబరు మాత్రమే ఇవ్వాలని, ఇద్దరికి కలిపి ఒక ఎల్పీఎం నంబరు ఇవ్వొద్దని సూచించారు. తహశీల్దార్ బీ జనార్దన్, వీఆర్‌ఓ చైతన్య, సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

ఏఎన్‌ఎం, ఆశ వర్కర్లపై డీఎంహెచ్‌వో ఆగ్రహం


పెరిదేపిలో రోగులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

కొండపి: గ్రామాల్లో జ్వరాలు వస్తుంటే ఎందుకు సమాచారం ఇవ్వలేదు.. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించడం లేదంటూ డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మండలంలోని పెరిదేపి, ముప్పవరం గ్రామాలను ఆయన సందర్శించారు. గ్రామాల్లోని జ్వర పీడితులను ఆయన నేరుగా కలుసుకొని వారితో మాట్లాడారు. ఈసందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ విష జ్వరాలు ప్రబలడానికి కారణం పారిశుధ్యలోపమే అన్నారు. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పెరిదేపిలో నాలుగు రోజుల పాటు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. అనుమానపు కేసులను గుర్తించి వెంటనే రక్త పరీక్షలు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి శ్రావణ్ కుమార్, పెట్లూరు వైద్యాధికారి డాక్టర్ అనూష, డాక్టర్ ప్రియాంక, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశ వర్కర్లు ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

మనసును మురిపించిన మంచు


కనిగిరి పట్టణంలో మంచుతో కప్పకున్న ప్రధాన రహదారి


ఉదయం ఎనిమిది గంటల సమయంలో టంగుటూరు నుంచి ఒంగోలు వైపు వెళ్లే రోడ్డులో ఇలా

కొండపి/కనిగిరి రూరల్: చల్లటి గాలులు.. పాల మేఘాలలా విహరిస్తున్న మంచు కొండల సోయగాన్ని చూసి జనం మురిసిపోయారు. సూరీడి కిరణాలు సైతం దోబూచులాడుతూ మంచుతెరలను చీల్చి భూమిని తాకాలని ఉవ్విళూరుతున్న సందర్భం వర్ణించలేనిది. మంగళవారం టంగుటూరు నుంచి ఒంగోలు వైపు వెళ్లే రోడ్డులో మంచు దుప్పటి కమ్మేసి వాహనదారులను ఇబ్బంది పెట్టింది. అలాగే మంచుతో కనిగిరి పట్టణం దుప్పటిలా కప్పుకొని నిదురపోయింది. ఉదయం 10 గంటలైనా మంచు తెరలు వీడలేదు.